## సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి

### • ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం, అక్టోబర్ 2 : రాష్ట్ర అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తక్కళ్లపల్లి, యాచారం, మంథన్‌గౌరెల్లి, కేసీతండా గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. నాలుగు గ్రామాల్లో రూ.4.32 కోట్ల అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. అంగన్‌వాడీ వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. తక్కళ్లపల్లిలో గ్రంథాలయం, యువజన సంఘం భవనం, సీసీరోడ్లు వేయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో మండలంలోని ప్రతి గ్రామంలోనూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, జడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వెంకటరమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదయ్య, సర్పంచ్‌లు శ్రీధర్‌రెడ్డి, విజయలక్ష్మి, సంతోష, మారు, హబీబుద్దీన్, ఎంపీటీసీలు సుమతమ్మ, ఇస్రత్ బేగం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాష పాల్గొన్నారు.



మంథన్‌గౌరెల్లిలో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

## కొప్పుల హరీశ్వర్‌రెడ్డికి జడ్పీటీసీ నివాళి



షాబాద్, అక్టోబర్ 2: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డికి షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పరిగిలోని హరీశ్వర్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు.అనంతరం హరీశ్వర్‌రెడ్డి తనయుడు, ప్రస్తుత పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని పరామర్శించారు. జడ్పీటీసీ వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గూడూర్ నర్సింగ్‌రావు, మాజీ జడ్పీటీసీ జడల రాజేందర్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శేరిగూడెం వెంకటయ్య, నక్క శ్రీనివాస్‌గౌడ్, పోన్న నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పీసరి సతీశ్‌రెడ్డి, అజయ్ తదితరులున్నారు.

## గవర్నర్‌ను కలిసిన ఫుడ్ కమిషన్ చైర్మన్



ఆమనగల్లు, అక్టోబర్ 2 : రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కమిషన్ సభ్యులతో కలిసి కలిశారు. కమిషన్ సభ్యులు ఆనంద్, భారతి, జ్యోతి, సెక్రటరీ మనోహర్ ఉన్నారు.

## జలసంరక్షణ అందరి బాధ్యత



చెరువు వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్న కౌన్సిలర్లు, అధికారులు

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 2: భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి మంత్రిత్వ శాఖ, కేంద్రీయ భూగర్భజల బోర్డు ప్రాంతీయ కార్యాలయ శాస్త్రవేత్త ఎం సుధీర్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఓబులేసు అన్నారు. బోర్డు ప్రాంతీయ సంచాలకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని చెరువు వద్ద పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దేవిడి గీతారెడ్డి, పాశం అర్చన, ప్రజాప్రతినిధులు వేణుగోపాల్‌రెడ్డి, దామోదర్, బోర్డు అధికారులు, శాస్త్రవేత్తలు విజయ సింహారెడ్డి, మాధవ్, యాదయ్య, రేష్మ పిళ్లై, బీజే మధుసూదన్, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి

షాద్‌నగర్‌రూరల్, అక్టోబర్ 2 : పరిసరాల పరిశుభ్రతతో పాటు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ఫరూఖ్‌నగర్ మండలంలోని దేవునిపల్లి గ్రామసర్పంచ్ రాఘవేందర్‌గౌడ్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామ పరిశుభ్రత వల్ల కలిగే లాభాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచారం.. నిందితుడికి రిమాండ్

శంకర్‌పల్లి, అక్టోబర్ 2 : బాలికకు మాయ మాటలు చెప్పి పలు మార్లు అత్యాచారం చేసిన వ్యక్తి ని సోమవారం పోలీసులు రిమాండ్ కు తరలించారు. ఎస్ఐ సంతోష్‌రెడ్డి వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలికకు బిహార్‌కు చెందిన గౌతమ్ కుమార్(24) మాయ మాటలు చెప్పి లైంగికదాడి చేశాడు. తన స్వ రాష్ట్రం బిహార్‌కు బాలికను తీసుకెళ్లి పూల దండలు మార్చుకుని పెళ్లి అయిపోయిందని ఆమెను నమ్మబలికి పలుమార్లు అత్యాచారం చేశాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-310380

## రూ.3.30 కోట్లతో అభివృద్ధి పనులు

షాద్‌నగర్‌రూరల్, అక్టోబర్ 2 : ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద, రంగంపల్లి గ్రామాల్లో రూ.3.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ముదిరాజ్ భవన నిర్మాణం కోసం రూ.30 లక్షలు, దళిత కమ్యూనిటీ హాల్ కోసం రూ.25 లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.10 లక్షలు, రజక, నాయీ బ్రాహ్మణ కమిటీ హాల్ కోసం రూ.17 లక్షలు, మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం రూ.15 లక్షలు, మైనార్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.15 లక్షలతోపాటు గ్రామంలో సీసీ రోడ్డు, అంతర్గత మురుగు కాల్వలు, ఇతర అభివృద్ధి పనుల కోసం లక్షల రూపాయాలను వెచ్చిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ లలిత, ఎంపీటీసీ శ్రీశైలం, రాధాకృష్ణ, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

## పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 2 : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇబ్రహీంపట్నం సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు నాగరాజు, యశంత్‌సింగ్, హిమబిందులతో కలిసి కోర్టు ఆవరణలో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెత్తాచెదారం, కలుపు మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలు దరిచేరవన్నారు. గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, న్యాయవాదులు మాదన్న, రవి, వెంకటేశ్, ధనుంజయ్య తదితరులున్నారు.



పరిసరాల పరిశుభ్రతపై ప్లకార్డులతో ప్రచారం చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, అక్టోబర్ 2 :మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సిద్ధిగారి వెంకటేశ్ తల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్ సోమవారం ఉదయం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి లక్ష్మమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రాధాకృష్ణ ట్రస్టు తరపున జడ్పీటీసీ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ చెన్నయ్య, ఉప సర్పంచ్ రామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతుబంధు గ్రామాధ్యక్షుడు నర్సింహ పాల్గొన్నారు.

## మొక్కలను సంరక్షించండి

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 2: హరితహారం కార్యక్రమంతో కాలనీలు పచ్చగా కళకళలాడుతున్నాయని కౌన్సిలర్ తొండాపు రోహిణి రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ 14వ వార్డు పరిధి వేంకటేశ్వరకాలనీలో ఇంటింటికీ ఆరు మొక్కల చొప్పున సోమవారం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. మొక్కల ప్రాధాన్యం గురించి పిల్లలకు అవగాహన కల్పించాలని చెప్పారు.



ఆరుట్ల గ్రామానికి చెందిన చిందం శేఖర్ విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా ఉద్యోగం సాధించాడు. అదేవిధంగా ఆనంద్ కుమార్ పశువైద్య శాఖలో డాక్టర్‌గా ఉచిత సీటు సాధించడంతో వారిని సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జంగయ్య, వార్డు సభ్యులు శివకుమార్, గ్రామస్తులు చిందం జంగయ్య, మహేందర్, చంద్రయ్య, సురేశ్, మోహన్ నాయక్, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు. **– మంచాల, అక్టోబర్ 2**

## నేడు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రాక

కేశంపేట, అక్టోబర్ 2 : మండలానికి మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రానున్నారు. మంగళిగూడ చౌరస్తా నుంచి లింగంధన వరకు సుమారు రూ.25 కోట్లతో నిర్మించనున్న రెండు లేన్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఉదయం 11 గంటలకు మంత్రి స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి ప్రారంభిస్తారు. అనంతరం సంగెం గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ ఎన్నం గోపాల్‌రెడ్డి కుమారుడు ప్రసూన్‌రెడ్డి జయంతి వేడుకల్లో మంత్రి, ఎమ్మెల్యే పాల్గొంటారు.


## బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మంచాల, అక్టోబర్ 2 : ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించడంతో నేడు గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధి కోసం రూ.1.40 కోట్లు నిధులు కేటాయించడంతో సమస్యలు పరిష్కరించడానికి నిధులు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. సమావేశంలో చంద్రయ్య, బుస్సు పుల్లారెడ్డి, బహదూర్, బద్రినాథ్‌గుప్తా, జంబుల కిషన్‌రెడ్డి, చిందం రఘుపతి, చిందం జంగయ్య, మహేందర్, రాజేశ్ పాల్గొన్నారు.

## విగ్రహ ఏర్పాటుకు లక్ష విరాళం



చేవెళ్లటౌన్, అక్టోబర్ 2: మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ ఏర్పాటుకు ఎంపీపీ విజయలక్ష్మి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రమణారెడ్డి లక్ష రూపాయల నగదును సోమవారం సభ్యులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో జంగారెడ్డి, శ్రీనివాస్, మహన్ చారి పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న నలుగురికి రిమాండ్

షాబాద్, అక్టోబర్ 2: అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. షాబాద్ సీఐ యాదయ్యగౌడ్ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన తెనాలి అశోక్, కర్ణాటకకు చెందిన సతీశ్‌బోస్లే, హరీశ్ జగ్లాఫ్, మహారాష్ట్రకు చెందిన రమేశ్ కంబ్లే, రజనీకాంత్‌లు ఆదివారం కారులో షాద్‌నగర్, షాబాద్, చేవెళ్ల మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని బాల్కికి వెళ్తుండగా.. షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్ గ్రామ శివారులో షాబాద్ పోలీసులు, రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు కలిసి కారును తనిఖీ చేశారు. అందులో 40 గంజాయి ప్యాకెట్లు దొరికాయి. వీటి బరువు 80 కిలోలు ఉంటుందని, వాటి విలువ రూ.25 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఐదుగురు నిందితుల్లో తెనాలి అశోక్ తప్పించుకోగా, మిగతా నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 80 కిలోల గంజాయి, ఒక ఇన్నోవా కారు, 4 సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.